56

# యేసు చెప్పిన భావి సూచన మరియు శిష్యుల ప్రశ్నలు

## (24:1-3)

మత్తయి సువార్త 23వ అధ్యాయంలో, వారి వేషధారణనుబట్టియు, వారు ఆయనను తృణీకరించినందుకును యేసు శాస్త్రులు మరియు పరిసయ్యుల మీదికి రానుండిన ఏడు శ్రమలను బహిరంగముగా ప్రకటించుచున్నట్లు చిత్రీకరింపబడి యున్నాడు. ఈ అధ్యాయము ముగియుచున్న సందర్భములో, "ఇవన్నియు ఈ తరమువారి మీదికి వచ్చును" (23:36) మరియు "ఇదిగో, మీ యిల్లు మీకు విడువబడి యున్నది!" (23:38) అని ఆయన సెలవిచ్చాడు. ఈ భవిష్యత్ సూచనలు యేసు 24 మరియు 25 అధ్యాయములలో వ్రాయబడియున్న తన ఏకాంత ప్రసంగమును చేయగలుగునట్లు మార్గమును సరాళము చేసినవి, ఈ అధ్యాయాలలో యెరూషలేము నాశనము మాత్రమేగాక ఆయన రెండవ రాకడ మరియు యుగాంతమును గూర్చియు ఆయన సవిస్తరంగా బోధించాడు. ఈ అధ్యాయములలోని యేసు బోధలు ఈ రోజుల్లో తరుచుగా "ఒలీవల ప్రసంగము" అని ప్రస్తావింపబడుచున్నది ఏలయనగా ఆయన ఒలీవల కొండ మీద నుండి ఈ బోధ చేసాడు. ఈ ప్రసంగము వాస్తవమునకు శిష్యులడిగిన ప్రశ్నలకు ఒక ప్రతిస్పందనయై యున్నది; ఇది క్రొత్త నిబంధనలో యేసు ఒక ప్రశ్నకు ఇచ్చిన సుదీర్ఘమైన సమాధానమై యున్నది.

ఈ అధ్యాయము దాని అర్థవివరణకు సంబంధించిన సవాళ్లను మనముందుంచుచున్నది. యేసు ప్రతి ప్రశ్నకు దాని దాని సంబంధిత సమాధానమును వేరువేరుగా ఈయకుండుట ఒక కష్టమై యున్నది; ఆయన యెరూషలేము నాశనము, అటుతరువాత ఆయన రెండవ రాకడ, అటుతరువాత యుగాంతము గూర్చి మాటలాడుచు, ఒక్కొక్క ప్రశ్నకు ఒకటి విడిచి మరొక దానికి వెళ్లుచు, మార్చి మార్చి సమాధానమిచ్చాడు. కాబట్టి మనము దాని సంక్షిప్త వర్ణనను చేయగలుగకుండునట్లును, దానిని స్పష్టముగా అర్థము చేసికొనకుండునట్లును ఈ వాస్తవము అధ్యాయమును మరి ఎక్కువ కఠినము చేయుచున్నది. యేసు చేసిన ఈ ప్రసంగము ముమ్ముందటి దారుణమైన పర్యవసానముల ప్రత్యక్షీకరణమునకును సంబంధించిన భాష మరియు ఉపమానములు కలిగియుండుట మరొక సవాలై యున్నది. కాబట్టి, చదువరి అరార్థమునకును, అలంకారికమునకును (సోదాహరణ సాదృశ్యము) మధ్య నుండు తారతమ్యములను గమనించుచుండవలెను. ఇంతేగాక, ఈ అధ్యాయంలో ప్రవచనాత్మక ముందుఛాయ కలదు. యెరూషలేము పట్టణము మరియు దేవాలయము క్రీ.శ. 70లో నాశనము చేయబడినప్పటికిని, యేసు క్రీస్తు రెండవ రాకడ ఇంత వరకు (రెండు వేల సంవత్సరములు గతించినవి) సంభవింపనప్పటికిని, ఈ సంఘటనలు అతి త్వరలో కలిసి సంభవింపనై యుండినవని యేసు సెవిచ్చాడు (24:29). ప్రవచనాత్మకమైన ముందు ఛాయ తరచుగా ఒకడు రెండు కొండలను కొంత దూరము నుండి దర్శించుటతో

పోల్చబడినది: అతడు ఈ రెండు కొండలను దూరము నుండి చూచినప్పుడు అవి దగ్గర దగ్గరగా కలసి యున్నట్లు కనబడును, కానీ వాస్తవమునకు అవి ఎన్నో మైళ్ల ఎడములో నుండును.

ఈ అధ్యాయము యెరూషలేము దేవాలయము నాశనము గూర్చి (24;1, 2) యేసు పలికిన భావి సూచనతో మొదలగుచున్నది. దీని తరువాత, ఆ యా సంఘటనల గూర్చి శిష్యులడిగిన ప్రశ్న మరియు రెండవ రాకడ (24:3) కలవు. మిగిలిన అధ్యాయమంతటిలో (24:4–51) శిష్యులడిగిన ప్రశ్నలకు ఆయన ఇచ్చిన సమాధానములోని కొంత వివరము కలదు.

## యెరూషలేము నాశనమును గూర్చిన భావి సూచన (24:1, 2)

**1యేసు దేవాలయమునుండి బయలుదేరి వెళ్లుచుండగా ఆయన శిష్యులు ఆ దేవాలయపు కట్టడములు ఆయనకు చూపింపవచ్చిరి. 2అందుకాయన–మీరు ఇవన్ని యు చూచుచున్నారు గదా; రాతిమీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనెను.**

**వచనము 1.** 21:23 నుండి కూడ **యేసు దేవాలయ ప్రాంగణములో** బోధించుచున్నట్లు మనము గమనించగలము. ఈ సంఘటనల తదనంతరము ఆయన తన మరణమునకు ముందు చివరిసారిగా దేవాలయమును విడిచి వెళ్లాడు. యేసు **శిష్యులు** యెరూషలేము గూర్చి ముగ్ధులయ్యారు, గనుక – ఆ నాటి అత్యధిక యూదుల వలెనే – అది ఎన్నటికిని నాశనము కాదని వారు కూడ నమ్మియుందురు.[1]

యేసు రోజుల్లోని యెరూషలేము దేవాలయము వాస్తవమునకు అదే స్థలంలో మోరీయా కొండ మీద నిర్మింపబడిన మూడవ ఆలయమై యుండినది. ఈ స్థలము ఒకానొకప్పుడు యెబూసీయుల పట్టణమై యుండినది. అబ్రాహాము మెల్కీసెదెకును, "షాలేము రాజు" మరియు "మహోన్నతుని యాజకుని" కలిసికొన్నది ఇచ్చటే (ఆదికాండము 14:18–20; హెబ్రీయులకు 7:1), మరియు అబ్రాహాము ఇస్సాకును బల్యర్పణ గావించినది కూడ ఇచ్చటేనని భావింపబడుచున్నది (ఆదికాండము 22:2). ఇదే పట్టణంలో, అనేక సంవత్సరముల తరువాత, దావీదు ఒక బలిపీఠమును కట్టనుద్దేశించి యెబూసీయుడైన అరౌనా యొక్క కళ్లమును కొనుగోలు చేసాడు (2 సమూయేలు 24:16–25).

దేవుని నిమిత్తము ఒక శాశ్వతమైన ఆలయమును నిర్మింపవలెనని దావీదు ఎంతో ఆశించాడు, కానీ దేవుడు అతనికి అనుమతి నియ్యలేదు (2 సమూయేలు 7:1–14; 1 రాజులు 5:3). ఈ ఆలయ నిర్మాణము నిమిత్తము దావీదు సమస్త వస్తుసామాగ్రిని, ధనమును, మరియు పనివారిని పోగుచేసినప్పుడు (1 దినవృత్తాంతములు 22:2–16), సొలొమోను నిర్దేశనములు మరియు పర్యవేక్షణ ప్రకారము మొదటి దేవాలయము నిర్మింపబడినది (1 రాజులు 6–8) కాబట్టి అది సొలొమోను మందిరము అని పిలువబడింది. ఈ మందిర నిర్మాణము క్రీ.పూ. 966లో ప్రారంభించబడి క్రీ.పూ. 959లో పూర్తిచేయబడింది. ముఖ్య కట్టడము ఈ ఏడు సంవత్సరముల కాలములో ముగింపబడినప్పుడు, సొలొమోను యింకా పదమూడు సంవత్సరముల వరకు మిగిలిన భాగములను కట్టించు పనుల్లో

నిమగ్నమయ్యాడు, రాజభవనములను మరియు ఇతర రాచరిక కట్టడముల పరంపరను కలుపుతూ వచ్చాడు, ఇవన్నీ కలిపి ఆలయ ప్రాంగణముల ఒక భారీ భవంతుల సముదాయమయ్యింది. చివరకు "ప్రాచీన ప్రపంచంలోని అద్భుతములలో" ఒకటిగా పరిగణింపబడిన గంభీరమైన పట్టణమయ్యింది. క్రీ.పూ. 586లో రాజైన నెబుకద్నెజరు చేత ఈ ఆలయము తగులబెట్టబడింది (2 రాజులు 25:9).

బబులోను చెర తరువాత, కోరెషు మహా రాజు, పారసీక దేశము నేలుచుండినవాడు, తమ నివాస స్థలములను కోల్పోయినవారు తిరిగి వారి వారి స్వస్థలములకు రావచ్చునని అనుమతినిచ్చాడు. గనుక క్రీ.పూ. 537లో (ఎజ్రా 2:64, 65) దాదాపు యాభై వేల మంది యూదులు తిరిగి యూదా మరియు యెరూషలేమునకు వచ్చారు. జెరుబ్బాబెలు నాయకత్వంలో, ప్రజలంతా కలిసి పాత స్థలంలోనే మందిర పునఃనిర్మాణమును ప్రారంభించారు. బలిపీఠము మరియు ఆలయము యొక్క పునాదులు వేయబడిన తరువాత, దాదాపు ఇరవై సంవత్సరముల వరకు నిర్మాణ పనులు కొనసాగలేదు. ఆ తరువాత ప్రవక్తలైన హగ్గయి మరియు జెకర్యా చేసిన ప్రవచనాత్మక హెచ్చరికలనుబట్టి (ఎజ్రా 5:1; 6:14; జెకర్యా 1:1) పనులు పునఃప్రారంభమయ్యాయి. "రెండవ ఆలయము," "పునరుద్ధరింపబడిన ఆలయము" మరియు "జెరుబ్బాబెలు ఆలయము" అని కూడ పిలువబడినది, క్రీ.పూ. 516లో పూర్తిచేయబడింది. ఈ నిర్మాణము సొలొమోను కట్టించిన నిర్మాణము కంటె దాని నాణ్యతలో తక్కువైనదైనప్పటికిని, అది దరిదాపుగా ఐదు వందల సంవత్సరములు, అనగా సొలొమోను మందిరము కంటె ఒక శతాబ్దము ఎక్కువ కాలము, దాని తరువాత కట్టబడిన దాని కంటె ఎంతో ఎక్కువ కాలము, చెక్కుచెదరకుండా నిలిచింది. ఈ దేవాలయము "ప్రపంచమందంతటను ప్రఖ్యాతిగాంచినది" అని వర్ణింపబడుచున్నది.[2]

యేసు మత్తయి 24:1లో ప్రస్తావించిన ఆలయము "మూడవ ఆలయమై" యుండినది, అది హేరోదు మహా రాజు ఆదేశాల మేరకు నిర్మింపబడినది. హేరోదు చేపట్టిన పునఃనిర్మాణ పథకము క్రీ.పూ. 19లో ప్రారంభమయ్యింది.[3] ఆలయ గర్భాలయ ప్రాంగణ ప్రారంభ పనులు ఒకటిన్నర సంవత్సరముల కాలములో పూర్తిచేయబడినవి, పై పలకలతో కూడిన స్తంభాల వరుస మరియు వెలుపటి ప్రాంగణము మరొక ఎనిమిది సంవత్సరముల కాలములో పూర్తిచేయబడినవి.[4] ఎంతైనా, ఆలయ భవన సముదాయ పనులు యేసు కాలములో కొనసాగినవి (యోహాను 2:20). వాస్తవమునకు, క్రీ.శ. 64 వరకు కూడ ఆలయమునకు మెరుగులు దిద్దబడుచుండిన పనులు యింకను చేయబడుచునే యుండినవి.[5] ఈ ఆలయము క్రీ.శ. 70లో రోమా సైన్యసమూహము చేత విధ్వంసము గావింపబడింది. ఈ నిర్మాణ సౌందర్యమును జోసీఫస్ ప్రకాశమానమైన ఈ క్రింది పదములతో వర్ణించుచున్నాడు:

> ఆలయము యొక్క వెలుపటి ముఖభాగమునకు మనుష్యుల మనస్సులను రంజింపజేయుచు వారి కనుదృష్టికి ఆశ్చర్యము కలిగించవలసినది ఏదియును అవసరము లేకుండినది, ఏలయనగా ఆ భాగమంతా బహు భారముగా నుండిన సువర్ణ రేకులతో కప్పబడినది, గనుక, అది తెల్లవారు జామున సూర్యోదయ సమయంలో, మహోజ్వలమైన గాంభీర్యమును ప్రతిబింబించినది, తత్ఫలితంగా వాటిని చూచుచుండినవారు సూర్యుని సొంత కిరణముల వెలుగును చూడలేక వారి కన్నులను ప్రక్కకు వచ్చినట్లుగా, త్రిప్పుకొనవలసి వచ్చినది. కానీ పరదేశస్థులు ఈ ఆలయమునకు కొద్ది దూరములో ఉన్నప్పుడు, అది వారికి మంచు

మయమైన కొండవలె అగుపించినది; ఏలయనగా, ఏ యే స్థలములలోనైతే బంగారు పూత రేకులు అమర్చబడలేదో, ఆ భాగములు అత్యంత తెల్లనివై యుండినవి.[6]

టాల్ముడ్‌లో, ఈ అలయము "ప్రపంచ నేత్రము" అని పిలువబడింది. "హేరోదు ఆలయమును చూడనివాడు, ఒక అందమైన కట్టడమును ఎన్నడును చూడనివాడే" అని కూడ అది సెలవిచ్చుచున్నది.[7]

శిష్యులు అబ్బురపడునట్లు చేసిన **దేవాలయపు కట్టడములు** బహుశా ఆలయమునకు వెలుపటి చుట్టుగోడల్లో అమర్చబడిన పలకల స్తంభముల పరంపరను సూచింపవచ్చును. ఆలయము నిర్మింపబడిన వేదిక స్థలమును రెట్టింపు చేసినప్పుడు హేరోదు మహా రాజు వీటిని నిర్మించాడు.[8] జోసీఫస్ ఇలా వ్రాయుచున్నాడు, "చాలా పెద్ద జపమందిరములతో ఆలయమంతటిని ఏదో ఒక విధంగా చుట్టుముట్టి దానిని అందులోనికి కలుపుకొని యుండును ... మరియు ఆలయమును అతడు తీర్చిదిద్దినంత అందచందంగా ఇంతవరకు ఏ ఒక్కరైనను తీర్చిదిద్దలేనంతటిదై యున్నదానిగా అగుపించునట్లు, వాటిపై అంతకు మునుపటి కంటె ఈసారి భారీ మొత్తములో సొమ్మును వెచ్చించాడు."[9] ఫిలో కూడ మనకు మరొక వర్ణన నిచ్చుచున్నాడు:

> ఈ ఆలయము యొక్క వెలుపటి వలయము, పొడవు వెడల్పులలో అతి పెద్దదైయుండి, అలంకార దుర్గములు అత్యంత వ్యయంతో నిర్మింపబడుట చేత దాని కాపుదలకు బలం చేకూర్చబడింది. వాటిలో ప్రతి ఒక్కటి రెట్టింపైన భవన ద్వారా మంటపంగా ఉండింది, అత్యంత మేలిరకమైన కఱ్ఱ మరియు రాతితో చూడముచ్చటగా కట్టబడి, సకల వస్తుసామగ్రి సమృద్ధిగా సమకూర్చబడి అత్యంత నిపుణులతో నిర్మింపబడి, పర్యవేక్షకుల శ్రద్ధాపూర్వకమున జాగ్రత్తతో నిర్మాణము పూర్తిచేయబడింది. కానీ లోపలి వలయములు తక్కువ పరిమాణములో ఉండినవి, మరియు అవి నిర్మింపబడిన తీరు మరియు అవి అలంకరింపబడిన విధానము అత్యంత సామాన్యమైనదై యుండినది. మధ్యలో దేవాలయముండినది, దాని అందము ఎవ్విధంగాను వర్ణింపశక్యముకానిదై యుండినది.[10]

దక్షిణమున నుండిన పలకల స్తంభాల పరంపర, రాచ ప్రాంగణము అని ప్రసిద్ధిగాంచింది, మనస్సుపై చెరగని గంభీరమైన ముద్రవేయునదై యుండింది. దాని గూర్చి సుదీర్ఘముగా వర్ణించిన పిదప, "దానిని చూడనివారికి, అది నమ్మశక్యముకానిదై యుండింది, దానిని చూచినవారికి, అది అత్యంత ఆశ్చర్యమును గొలుపుచుండినదని" జోసీఫస్ చెప్పుచున్నాడు.[11] కాబట్టి, ఆలయ కట్టడములను అనేక మారులు స్వయంగా చూచి ఆనందించినప్పటికిని, శోభాయిమానమైన కట్టడముల నిర్మాణ కళను శిష్యులు యేసు యెదుట ప్రస్తావించారను వాస్తవము మనలను ఆశ్చర్యచకితులను గావింపనవసరములేదు.

**వచనము 2.** శిష్యులు ఆ కట్టడములను ప్రశంసించుచుండిన సందర్భములో యేసు ప్రతిస్పందిస్తూ, **మీరు ఇవన్నియు చూచుచున్నారుగదా? రాతి మీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడునని, మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని** వారితో అనెను. ఏదో ఒక గమనార్హమైన భారీ దుర్ఘటన సంభవింపనై యున్నదని తన శిష్యులు అర్థంచేసికొనవలెనని ప్రభువు పై మాటలు సెలవిచ్చుచుండెను; ఆయన మాటలు ఆలయము మరియు సంబంధిత కట్టడముల సముదాయము యొక్క సర్వనాశనమును సూచించినవి. "రాతి మీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడును" అను

మాటలు “కట్టడముల నిర్మాణ ప్రక్రియ క్రమమును తిరగరాయుచున్నవి.”[12]

కట్టడ నిర్మాణమునకు హేరోదు రాజు పనివారు ఉపయోగించిన రాళ్లు అత్యధిక ప్రమాణంలో ఉండుటనుబట్టి, యేసు తన శిష్యులకు ముందుగానే తెలియజెప్పుచుండిన సంభవము వారికి నమ్మశక్యముకానిదై యుండింది. వెలుపటి గోడలను నిర్మించుటకు ఉపయోగింపబడిన ఈ రాళ్లలో కొన్ని, కొన్ని వంద టన్నులకు మించిన బరువైనవై యుండినవి. ఈ ఏకశిలా సున్నపు రాళ్లను అవి త్రవ్వబడిన రాళ్లగనులలో నుండి కట్టడ నిర్మాణ స్థలమునకు రవాణా చేయుటకు నానా విధములైన పద్ధతులు అమలుచేయబడినవి: (1) ముక్కాలు పీట సహాయంతో వాటిని ఎత్తైన స్థలముల మీదికి ఎత్తుట, (2) వాటికి బండి వలె చక్రములను అమర్చుట, (3) వాటి చుట్టుపరిధిలో చక్రములను అమర్చట, మరియు (4) వాటి క్రింద కొయ్యదుంగలను ఉంచుట. బరువైన ప్రతి రాయి అనేక జతల ఎడ్లు, ఒక జత వెనుక మరొక జత వరుసగా (బండికి కట్టబడినట్లు) కట్టబడి లాగించబడినది. వరుసగా రాళ్లు అమర్చబడుచుండిన ఎత్తు వరకు ఏటవాలుగా నుండు ఎత్తైన మట్టి బల్లలను నిర్మించి, నిర్మాణ పనులన్నీ పూర్తియైన తరువాత వాటిని తొలగించుచుండిరి.

క్రీ.శ. 70లో, రోమా సైన్యసమూహము, కోటగోడలను సహితము మాటిమాటికి కొట్టుట ద్వారా కూలగొట్టగల సమ్మెటలతో ఆలయముండిన కొండపై దాడిచేయుచు, ఉత్తరమున నున్న ద్వారము యొక్క వెలుపటి రాళ్లను తొలగించినదని జోసీఫస్ నివేదించుచున్నాడు. వారు ఆశించినంత సఫలతను సాధించలేకపోయినందు వలన, పలకలుగల స్తంభముల మీదికి నిచ్చెనలు వేసికొని పైకెక్కారు. అతని సైన్యసమూహము యూదుల చేత ఎదిరించబడి వెనుకకు తరుమబడుచున్నదని అతడు గమనించినప్పుడు, వారు ఆలయ నిర్మాణ సముదాయము వరకు చొచ్చుకొని వెళ్లగలుగునట్లు ద్వారములకు నిప్పుపెట్టి వాటిని సమూలంగా కాల్చివేయవలెనని తీతు చివరకు ఆదేశాలు జారీచేయక తప్పలేదు. ఈ మంటలు ద్వారముల నుండి స్తంభాలకు అంటుకొన్నాయి. గనుక రోమా సైన్యసమూహము ఆలయములోనికి ప్రవేశించగలిగింది. ఏది ఏమైనా, యుక్తాయుక్తమైన కారణసహిత ఆలోచనల తరువాత, ఆలయమును కాపాడవలెనను ఉద్దేశంతో మంటలను ఆర్పివేయవలెనని తీతు మరొకసారి తన ఆదేశాలు జారీచేసాడు. అట్లయినప్పటికిని, ఒక ప్రక్క పోరాటము కొనసాగుచుండగా మరొక ప్రక్క మంటలు వ్యాపించుచుండినవి, ఇంతలో కొందరు సైనికులు బుద్ధిపూర్వకంగానే లోపలి ప్రాంగణములకును ఆలయమునకును నిప్పు పెట్టుచుండిరి.[13] స్పష్టముగా, ఈ మంటలకు తట్టుకొనగలిగిన రాళ్లు విజయాన్ని సాధించుచుండిన సైన్యము చేత ధ్వంసము చేయబడినవి.

యేసు పలికిన భవిష్యత్ సూచనలోని మాటలు, ఒక్కొక్క రాయి దానికి క్రింద నున్న రాయి నుండి అక్షరాలా తొలగించబడినదను అర్థమీయనవసరము లేదు; మంటల మూలాన ఆలయము నాశనమయ్యిందనునది ఈ మాటలకు సంతృప్తికరమైన సమాధానము నిచ్చుచున్నది (చూడు 22:7). ఆలయము నిర్మింపబడి యుండిన కొండ యొక్క పైభాగము నాశనము చేయబడినప్పటికిని, హేరోదు రాజు నియమించుకొనిన నిర్మాణపు పనివారి చేత వాడబడిన భారీ పరిమాణములో నున్న కొన్ని రాళ్లను పశ్చిమ గోడలో నేడు కూడ చూడవచ్చును, నేడు ఈ గోడ “విలాప గోడ”గా పిలువబడుచున్నది. ఆలయపర్వతము పొడిగింపబడి అది నిలిచియుండునట్లు నిర్మింపబడిన గోడలో ఇదొక భాగమై యుండినది.

ఆలయ విధ్వంసము పాపము వలన కలిగిన శిక్షాఫలితమై యున్నదని యేసు బోధించాడు. కాబట్టి, హేరోదు నిర్మించిన ఆలయము యొక్క విధ్వంసమునకును, క్రీ.పూ. 586లో సొలొమోను నిర్మించిన ఆలయము పతనమగుటకును మధ్య సమీప సమానాంతరము కనబడుచున్నది. యెరూషలేము దేవాలయము యొక్క సంపూర్తి నాశనము గూర్చి యేసు ప్రవచించినందునుబట్టి, డగ్లస్ ఆర్. ఏ. హెర్, యేసును "కడవరి దినముల యిర్మీయా" యని పోల్చాడు.[14] ప్రవక్తలు ప్రవచించినట్లుగానే, దేవాలయము నాశనమగునని క్రీస్తు కూడ ప్రవచించాడు (యిర్మీయా 7:14; 26:6, 18; మీకా 3:12). గమనార్హమైన విషయమేమంటే, క్రీ.శ. 70 నాటి ఆలయ నాశనమును అనేక మంది యూదులు, అది దేవుని తీర్పైయున్నదని పరిగణించారు.[15] ఆలయము నాశనమగునని యేసు ప్రవచించినప్పటికిని, దానిని వారి సమావేశము నిమిత్తము సద్వినియోగము చేసికొనుటకు ఆది సంఘము సంకోచించలేదు (అపొస్తలుల కార్యములు 2:46; 3:1, 11). యెరూషలేము దేవాలయమునకు యేటేట వెళ్లుచుండిన ఆనవాయితీని అనుసరించుచునే, యూదులై యుండిన క్రైస్తవులు అచ్చోటికి వెళ్లుట మానలేదు (అపొస్తలుల కార్యము 21:26, 27), బహుశా అది సమూలంగా నాశనమయ్యేవరకు దీనిని కొనసాగించి యుందురు.

## శిష్యులడిగిన ప్రశ్న (24:3)

**3ఆయన ఒలీవ కొండమీద కూర్చుండియున్నప్పుడు శిష్యులాయనయొద్దకు ఏకాంతముగా వచ్చి-ఇవి ఎప్పుడు జరుగును? నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమనిరి.**

**వచనము 3.** ఇప్పుడు సన్నివేశము ఆలయము నుండి **ఒలీవల కొండకు,** యెరూషలేమునకు తూర్పున కిద్రోను లోయకు ఆవల నున్న చోటుకు మారుచున్నది (21:1పై గల వ్యాఖ్యానము చూడు). తన సువార్త రచనను యూదేతర విశ్వాసులను దృష్టిలో ఉంచుకొని వ్రాయుచు, ఒలీవల కొండ "దేవాలయము ఎదుట" నున్నదని మార్కు వివరించుచున్నాడు (మార్కు 13:3). ఈ కొండ మీద నుండి యేసు మరియు ఆయన శిష్యులు ఆలయపర్వతము మరియు పట్టణమంతటి విహంగ దృశ్యమును కనువిందుగా చూడగలుగుచుండిరి. ఈ చోట నుండి చూచినప్పుడు అగుపించు దృశ్యము, ప్రత్యక్షీకరణ సంబంధమైన సాహిత్యముతోపాటుగా (జెకర్యా 14:4), యెరూషలేము పతనము మరియు సమస్త విషయముల అంతము గూర్చి సంభాషించుటకు దానినొక సముచితమైన స్థలముగా చేసింది.

యేసు **కూర్చుండి యుండెను,** అది ఉపదేశకుడు కూర్చుండు మాములు తీరై యుండినది (5:1; 13:2; 23:2; 26:55), **అప్పుడు ఆయన శిష్యులు ఆయన యొద్దకు వచ్చారు.** పేతురు, యాకోబు, యోహాను మరియు అంద్రెయ అను వారు యేసు యొద్దకు వచ్చారని మార్కు సువార్తీకుడు నిర్దిష్టముగా పేర్కొనుచున్నాడు (మార్కు 13:3). యేసు మొట్టమొదట పిలిచినది ఈ నలుగురినే (4:18-22). ఈ నలుగురిలో నుండి ముగ్గురు యేసుకు ఎక్కువ సన్నిహితముగా (అంతర్‌వలయములో) నుండిరి (17:1పై గల వ్యాఖ్యానము చూడు). ఆయన దేవాలయ నాశనము గూర్చి పలికిన ప్రవచనమేమిటో యని వీరు ఆయనను

**ఏకాంతముగా** ప్రశ్నించారు. **ఇవి ఎప్పుడు జరుగును? నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమని** వారడిగారు. శిష్యులు రెండు ప్రశ్నలు అడిగారని గ్రీకు గ్రంథ పాఠము సూచించుచున్నది. శిష్యులు మొదట, "ఇవి ఎప్పుడు జరుగును? మాతో చెప్పుమని" ఆయనను ప్రశ్నించారు. ఈ ప్రశ్న యెరూషలేము దేవాలయము యొక్క నాశనము గూర్చినదై యున్నది. "ఇవి/ఈ విషయములు" అను మాటలు ఈ అధ్యాయంలో ప్రయోగింపబడిన ఒక కీలకమైన పదజాలమై యున్నది, మరియు అది సాధారణంగా యెరూషలేము పతనమును తెలియజెప్పునదై యున్నది. దీనికి తోడుగా, "నీ రాకడకును, ఈ యుగసమాప్తికిని సూచనలేవి?" అని శిష్యులు ఆయనను ప్రశ్నించారు. యేసుక్రీస్తు "రాకడ" మరియు "యుగ సమాప్తి" వ్యాకరణ రిత్యా జోడింపబడి యున్నవి,[16] గనుక "సూచన" అని ఏకవచనము వాడబడినది. ఇవన్నీ ఒకే సమయంలో సంభవించునని శిష్యులు తలంచుట సంభావ్యమై యున్నది.

"రాకడ" అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*parousia*) ఒక గమనార్హమైన మాట యై యున్నది. అది ఒకరి "సమక్షముతో కూడిన ఆగమనము యొక్క మొదటి దశయై యున్నదని" సూచించుచున్నది.[17] ఏది ఏమైనా, ఈ పదమునకు యింకా ఎక్కువ సాంకేతికపరమైన అర్థములుండినవి. గ్రీకు సాహిత్యములో, అంతవరకు దాగి యుండిన వ్యక్తిత్వ ఆగమనమును సూచించుటకు *parousia* అను పదము ప్రయోగింపబడినది, ఈ వ్యక్తి వచ్చి తన శక్తిని బయలుపర్చుట ద్వారా ప్రజల యెదుట తన ఉనికిని ప్రదర్శించాడు. దీనికి అదనంగా, ఈ పదము తన రాజ్యములోని ఏదైన ఒక ప్రదేశమును సందర్శించుటకు వచ్చిన ఒక రాజు లేక ఒక చక్రవర్తి వంటి ఉన్నత శ్రేణికి చెందిన ప్రభుత్వ అధికారి సందర్శనమును సూచింపవచ్చును.[18] యేసు పునరాగమనము గూర్చి యోచించినప్పుడు ఈ రెండు నిర్వచనములు కూడ కలిసిపోవును. ఏలయనగా ఆయన దైవికమైన దేవుని కుమారుడును, రాజులకు రాజు మరియు ప్రభువులకు ప్రభువునై యున్నాడు. ఆయన ప్రస్తుత కాలమందు శారీరకంగా దాగి యున్నట్లు అగుపించినప్పటికిని, ఆయన తనను తాను సమస్త జనులకు బయలుపర్చుకొని, తీర్పు సమయంలో తన శక్తిని ప్రదర్శించును ఆయన ఆగమనము నిజముగా సమస్త విశ్వాసుల మధ్య నున్న ఆయన సన్నిధి ప్రసన్నత యొక్క గంభీరమైన దశయై యుండును. ఇదే పదము ఈ అధ్యాయములో అనేక పర్యాయములు వాడబడియున్నది (24:3, 27, 37, 39). యేసు క్రీస్తు యొక్క రెండవ రాకడను సూచించుచున్న సందర్భములో ఈ పదము క్రొత్త నిబంధనలోని ఇతర రచనలలో కూడ అగుపించును (1 కొరింథీయులకు 15:23; 1 థెస్సలోనియులకు 2:19; 3:12, 13; 4:15; 5:23; 2 థెస్సలొనీకయులకు 2:1, 8; యాకోబు 5:7, 8; 2 పేతురు 1:16; 3:4; 1 యోహాను 2:28).

"యుగ సమాప్తి" అను పదజాలము మత్తయి వ్రాసిన సువార్తలో ఐదు పర్యాయములు అగుపించును (13:39, 40, 49; 24:3; 28:20; చూడు హెబ్రీయులకు 9:26) ఈ పదము ప్రయోగింపబడిన ఈ సందర్భములన్నిటిలోను, లోకము సమాప్తియగునని అర్థమిచ్చుచున్నది, కేవలము యూదీయ సంవిధానము లేక మోషే నియమము యొక్క అంతము కాదు.

సూచనలు

[1]చూడు Philo *Special Laws* 1.14. [2]2 Maccabees 2:22. [3]Josephus *Wars* 1.21.1. [4]Josephus *Antiquities* 15.11.6. [5]Ibid., 20.9.7. [6]Josephus *Wars* 5.5.6. [7]Talmud *Baba Bathra* 4a. [8]"తత్ఫలితంగా ఏర్పడిన ఆలయ పరిమాణము ఏథెన్సు మహా నగరములోని ఎత్తైన రాతి కట్టడము [కోట] గల ప్రదేశము కంటె రెట్టింపు ఎక్కువగా ఉండినదని" జాక్. పి. లూయిస్ గుర్తించాడు. (Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary [Austin, Tex.: Sweet Publishing Co., 1976], 120.) [9]Josephus *Antiquities* 15.11.3; చూడు 15.11.5. [10]Philo *Special Laws* 1.13. "అంతర్ వలయములు" అని ఫిలో చేయుచున్న ప్రస్తావన స్పష్టముగా అంతర్ ప్రాంగణములలో నుండిన అసంఖ్యాకమైన గదులను సూచించుచున్నది, అవి యాజకులు, ఇశ్రాయేలీయుల పురుషులు, మరియు ఇశ్రాయేలీయుల స్త్రీల నిమిత్తము రూపొందింపబడినవి.

[11]Josephus *Antiquities* 15.11.5. [12]Ronald A. Hagner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 688; చూడు Haggai 2:15. [13]Josephus *Wars* 6.4.1-8. [14]Douglas R. A. Hare, *Matthew,* Interpretation (Louisville: John Knox Press, 1993), 273. [15]Josephus *Wars* 6.5.3, 4; Talmud *Shabbath* 119b; *Yoma* 9b. [16]గ్రీకు భాషలో, "రాకడ" మరియు "సమాప్తము" అను పదము ఒకే ఉపపదమును కలిగియుండును/ఒకే ఉపపదముపై ఆధారాపడును. [17]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 780. [18]Ibid, 780-81.